# ప్లాటుఫారమో?

పల్లెటూరి సరుకంతా నిగ్గు. గాలీ నీరూ ఆహారం ఆడపిల్లలూ సంభాషణలూ ప్రకృతీ – అన్నిటిలోనూ, అందమూ సున్నితం లేకపోయినా, జీవం వుట్టిపడుతూ, ఆకర్షణీయంగా నిబ్బరంగా ఉంటాయి. అందుకనే నేను పల్లెటూరి పిల్లను కోరి చేసుకున్నాను. ఆవిధంగా నయినా అప్పుడప్పుడు పల్లెటూరి సౌందర్యలక్ష్మిని పొందవచ్చునని ఆశ.

అల్లుళ్ళ పండుగ దివాలీకి అక్కడే ఉన్నాను. సాయంత్రం మా ఆవిడ నన్నలంకరిస్తోంది. “అక్కా! అక్కా!” అన్న కేకలు ఝూ...మని గాలివానలా దగ్గర పడుతున్నాయి. పన్నె పారేసి తొందరగా బయటకు పరుగెత్తింది, ఎదుర్కోవటానికి. నేనేదో చదువుతున్నట్టు నటించబోయాను. ఎందుకో ఆ భయం? తుఫాను ద్వారం దగ్గర ఆగింది. పదహారు సంవత్సరముల అమ్మాయి, అందమయిన ముఖం కాదు గాని కలకల్లాడుతూ ఆకర్షవంతం గా ఉంది. బాగా టాయ్‌లెట్ అయ్యింది. ఏదో ఉత్సాహంగా దబదబ మాట్లాడుతోంది. పొరుగు వాళ్ళమ్మాయనుకుంటాను. బహుశా నన్నూ చూసి ఉండదు. మా ఆవిడ మెల్లగా అక్కడ నుండి తీసుకుపోయింది. ఎందుకో ఆ మాయ?

ఉబుసుపోకకు అరమైలు దూరాన వున్న ఆ ఊరు రైల్వేస్టేషనుకు వెళ్ళాను. అక్కడ పిల్లల ఉత్సాహం మొదలైన వాటి గురించి ఆలోచిస్తూ అరగంట టయిమయింది. ఆ అమ్మాయి జ్ఞాపకానికి వచ్చింది. ఆలోచిస్తూ వుంటే ఆమె ముఖం దేనితో పోల్చడం అని సందేహం వచ్చింది. ఆలోచిస్తూ చెట్టు కింద గడ్డిలో కూర్చున్నాను. కలకల లాడుతుంది గాని అందంగా ఉండదు. పరధ్యానంగా పట్టాలవైపు చూశాను. దూరంగా పొగ. ప్లాటుఫారంవైపు చూశాను. అంతమంది ఎక్కణ్ణుంచి వచ్చారో అప్పటికప్పుడు; జనంతో కలకలలాడు తోంది. ఆ.. ఆ అమ్మాయి ముఖం లాగా ఉత్సాహంగా వుంది.

టంగ్ టంగ్ టంగ్ టంగ్... ఆ అమ్మాయి నవ్వులాగే కొట్తోంది గంట.

చుక చుక చుక చుక అంటూ వచ్చి అలిసిపోయినట్టాగింది రైలు. ప్లాటుఫారమంతా ఆతృతతో ఉబికింది.

టంగ్... టంగ్... టంగ్... టంగ్ మూలుగుతూ కొట్టింది గంట. గూ...ప్ అంటూ పెద్ద నిట్టూర్పు విడిచి వెళ్ళిపోయింది ట్రైను. రెండు నిమిషాల్లో ప్లాటుఫారం కళావిహీనమై శూన్యమయింది.

ఇంటికి బయలుదేరి, తాపీగా ఏదో పరధ్యానంగా, పట్టాలతో పోలుస్తూ, వస్తూ వూరికినే వెనుదిరిగి చూశాను. దూరంగా ఓ అబ్బాయి వస్తున్నాడు స్పీడుగా ట్రైనులాగా. అప్పుడప్పుడు వెనుదిరిగి చూస్తూ యిల్లు చేరుకున్నాను. అతడు అదే సమయానికి నన్ను కలిశాడు.

వడి తగ్గింది, ఇల్లు సమీపించగానే – ప్లాటుఫారం సమీపించిన రైలులాగ. వీధి మొదట ఉన్నాయి మా యిళ్ళు. పొరుగింటి అమ్మాయి వీధరుగు మీద నిలుచుని ఉంది. నేను మెట్ల దగ్గర ఆగి చూస్తున్నాను. ఆమె ముఖంలో ఆతృత – అప్పుడు ప్లాటుఫారం ఆతృతతో ఉప్పొంగినట్లే. ఆమె ముందర అతగాడు తమ్ముడు కావోసు – ట్రైను అలాగే స్పీడు తగ్గి క్రమంగా ఆగింది.

“రా... లేదు’. ఆమె మెల్లగానే అంది. కాని ప్లాటుఫారం గంట టంగ్... టంగ్... మని కొట్టినప్పుడు అందులో ఎటువంటి మూల్గు వినపడ్డాదో అలాంటిదే యిందులో కూడా నాకు వినపడ్డాది. గుప్‌మని నిట్టూర్పు విడిచి లోపలికి వెళ్లిపోయాడా అబ్బాయి. ఆమె శూన్యంగా చూసింది.

నే నాలోచిస్తున్నాను – యీమె ప్రియుని కోసం నిరీక్షిస్తోంది; మరి నా ప్లాటుఫారమో? ★

(కార్డు కథ: చిత్రగుప్త: 1943 సెప్టెంబరు 1, బుధవారం)